క్లుప్తంగా

రజకుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి వేణుగోపాలకృష్ణకు వినతి ఇస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: రజకుల స్థితిగతులను అధ్యయనం చేసి, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలను తీసుకోవడానికి కమిటీ నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణకు 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, రజక కార్పొరేషన్ ప్రతినిధి యువశ్రీ వినతి పత్రం అందజేశారు. మంత్రిని ఆయన కార్యాలయం వద్ద బుధవారం కలిసిన వీరు రాష్ట్రంలోని రజక సామాజిక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఎస్సీలుగా రిజర్వేషన్ కల్పించాలని కోరారు.మంత్రిని కలిసిన వారిలో పార్టీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ తదితరులు ఉన్నారు.

యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డులకు సంబంధించి యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. స్థానికంగా నాయీ బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులు సీపేరాజు, శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం సభ్యుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తామన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో సామాజిక భవనం ఏర్పాటుకు అధికారులు,పాలకులను కలిసి ఒప్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి పి.శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు కాన్షీరాం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ అంబేడ్కర్ కళావేదికలో కాన్షీరామ్ 89వ జయంతి వేడుకలను బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరమజ్యోతి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరణం తిరుపతిరావు, మరో ప్రధాన కార్యదర్శి కొల్లా బత్తుల సత్యం, మాజీ ఎమ్మెల్యే లక్కే రాజారావు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుగుల ధనుంజయ్ మాట్లాడుతూ కాన్షీరామ్ బావితరాలకు బాట అని, ఆయన బడుగు, బలహీన వర్గాల వికాసం కోసం అగ్రవర్ణ కులాలలతో పోరాటం చేశారని కొనియాడారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలతో భారం

సింధియా: నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ మహిళా నాయకురాలు తోట రత్నం అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, కాకరలోవ, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మూడేళ్లల్లో నిత్యావసర ధరలు భారీగా పెరిగాయని, సామన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. పాలకులు స్పందించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీరబాబు, రాజు, పూర్ణిమ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పరిమళం.. గణపతి సన్నిధానం

- ముక్కోటి దేవతలు కొలువుదీరిన క్షేత్రం
- ఆహ్లాదకర వాతావరణం ఆలయం సొంతం
- పలు చిత్రాల్లో సన్నివేశాల చిత్రీకరణ





వేంకటేశ్వరస్వామి, గణపతి ఆలయ సన్నిధి (అంతర చిత్రం) పూజలందుకుంటున్న దుర్గాగణపతి



దుర్గాగణపతి ఆలయ ముఖద్వారం

మల్కాపురం: ఆహ్లాదకర వాతావరణం.. ఆధ్యాత్మిక పరిమళం.. ఎటు చూసినా పచ్చని మొక్కలు.. మనసుకు ప్రశాంతత ఇచ్చే దేవతామూర్తులు.. ఇలా పచ్చటి వాతావరణంలో ముక్కోటి దేవతా మూర్తులు కొలువుదీరిన ప్రాంగణం మల్కాపురం వద్ద ఉంది. ఈ ఆలయాన్ని దర్శిస్తే ప్రశాంతంగా నచ్చిన దేవుడిని మనసారా స్మరించుకోవచ్చు.

వాస్తు దోషం తొలగాలని..

మల్కాపురం సమీపంలోని ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ వద్ద దుర్గాగణపతి ఆలయాన్ని 1986లో నిర్మించారు. ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌లో పలు అవాంతరాలు ఏర్పడుతున్నాయనే కారణంతో పెద్దలు, పండితులు సూచనలతో ఇక్కడ దుర్గాగణపతిని నెలకొల్పినట్టు సమాచారం. నాటి నుంచి ఐవోసీ కార్యకలాపాలకు ఎలాంటి అవాంతరాలు కలగలేదు.

దినదిన ప్రవర్ధమానంగా..

తొలిరోజుల్లో దుర్గాగణపతిని ఐవోసీ ఉద్యోగులు,అధికారులు,ఇక్కడ ఆయిల్ లారీ డ్రైవర్లు,క్లీనర్లు మాత్రమే దర్శించుకునే వారు. ఈ ఆలయ విశిష్టతను తెలుసుకుని దుర్గాగణపతిని దర్శించుకునే వారి సంఖ్య పెరిగింది. కోర్కెలు కోరితే అవి కచ్చితంగా నెరవేరుతాయని భక్తుల్లో నమ్మకం ఏర్పడడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఈ ఆలయంలో వివిధ దేవతా మూర్తులను కొలువుదీర్చారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునసామి,శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి,అయ్యప్ప,నవగ్రహాలు,ఆంజనేయ స్వామి, శ్రీకష్ణుడు,దుర్గాదేవి,శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, సత్యనారాయణస్వామి,హయగ్రీవ, షిర్డీసాయిబాబా,బ్రహ్మ ఇలా అనేక దేవత మూర్తులను ఇక్కడ ఒకేసారి దర్శించుకోవచ్చు.

నిత్య పూజలు

ఇక్కడ ప్రతి రోజు నిత్యపూజలు జరుగుతూనే ఉంటాయి. పారిశ్రామిక ప్రాంతం నుంచే కాక గాజువాక, మింది ప్రాంతాల నుంచి ఇక్కడకు భక్తులు వస్తారు. గణపతి నవరాత్రులు, వైకుంఠ ద్వార దర్శనం,అయ్యప్ప మాల పూజలు, దుర్గాదేవి నతరాత్రుల్లో ఈ క్షేత్రానికి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. ఆలయంలో పచ్చని వాతావరణం ఉండే విధంగా ఇక్కడ పలు ఔషధ మొక్కలు వేశారు. దేవుని స్మరణతో పాటు సుగంధ పుష్పాల సువాసన ఇక్కడ గుభాళిస్తుంది. ఈ ఆలయాల వద్ద ష్..గప్‌చుప్, చంటబ్బాయ్ వంటి చిత్రాల షూటింగ్‌లు జరిగాయి.



శివునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

తైక్వాండో జాతీయ పోటీలకు మధురవాడ క్రీడాకారులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల యలమంచిలిలో సబ్ జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటికి మధురవాడ నుంచి 14 మంది క్రీడాకారులు హాజరుకాగా 10 మంది బంగారు, ఒకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో 10 మంది ఈ నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధురవాడ యూత్ తైక్వాండోకు చెందిన జి.భాషిత, ఎ.నిత్యశ్రీ, పి.జ్ఞానశ్రీ, కె.ధనలక్ష్మి, కె.మహేశ్వరరావు, పి.సుధీర్, ఎస్.విశాల్, పి.జశ్వంత్ సాయిసూర్య, ఎ.వివేక్ అభిసాయి, టి.మణికంఠ బంగారు పతకాలు గెలుచుకున్నారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మధురవాడకు చెందిన శ్రీ కనక దుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయిర్స్ నిర్వాహకులు కొర్రాయి సురేష్ ఆర్మ్ గార్డ్స్, చెకెన్ గార్డ్స్ బుధవారం బహూకరించారు. విజేతలను మధురవాడ యూత్ తైక్వాండో కోచ్‌లు సురేష్, సుకుమార్, సంపత్ తదితరులు అభినందించారు.

కోరాపుట్-కొత్తవలస లైన్‌లో తనిఖీలు

అభివృద్ధి పనులు పరిశీలించిన జీఎం మనోజ్‌శర్మ



శివలింగపురం స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జీఎం మనోజ్ శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ రెండో రోజు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల కోరాపుట్ - కొత్తవలస లైన్లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలో కోరాపుట్, అరకు, బొర్రా గుహలు, శివలింగపురం స్టేషన్ల మధ్య సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, స్టేషన్లను తనిఖీ చేశారు. విండో ట్రెలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కోరాపుట్ - కొత్తవలస సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో గల రన్నింగ్ రూం, రెస్ట్ హౌస్‌లను పర్యవేక్షించారు. అనంతరం రన్నింగ్‌రూంలో లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్స్‌తో మాట్లాడారు. అరకు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ - వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను, రెస్ట్‌హౌస్‌లను కూడా పరిశీలించారు. అమృత్ భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. చిమిడిపల్లి వద్ద గల టన్నెల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల గూడ్స్ రైలు ప్రమాదం జరిగిన శివలింగపురం యార్డ్‌ని పరీక్షించారు. పర్యటనలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్

ఎంపీలకు ఉక్కు అధికారుల సంఘం లేఖలు



ఎంపీలకు రాసిన లేఖలను ప్రదర్శిస్తున్న మాజీ డైరెక్టర్ రావు, సీ ప్రతినిధులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటీకరణ తప్పదని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లోకసభ, రాజ్యసభ ఎంపీలకు పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. ఆ లేఖల్లో ప్రైవేటీకరణ ప్రత్యామ్నాయం, సెయిల్‌లో విలీనం, వాటి ఉపయోగాలు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ లక్ష్య సాధన, ఉద్యోగాల కల్పన, రిజర్వేషన్లు అమలు వంటి అంశాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉక్కు సామర్థ్యం పెంపు గురించి లేఖల్లో వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.కె.రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో ఆంధ్రులకు చాలా అనుబంధం ఉందన్నారు. సెయిల్ నుంచి విడదీసిన విశాఖ ఉక్కును తిరిగి విలీనం చేయడం ద్వారా లాభదాయకమైన ఉత్పాదనకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నరసింహతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిల దాడులను అరికట్టండి



మద్దిలపాలెం డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మద్దిలపాలెం: ప్రజా రవాణ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులపై అమానుషంగా దాడులకు పాల్పడిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ దాడులను ఖండించాలని కోరుతూ బుధవారం మద్దిలపాలెం విశాఖ రూరల్ డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.సూర్యనారాయణ, కార్యదర్శి సీతాలక్ష్మి మాట్లాడుతూ డిపో ప్రాంగణంలో ఇలాంటి ఘటనల జరగడం దురదృష్టకర మన్నారు. డిపో ఎదురుగా వున్న బస్టాప్ నిరుపయోగంగా ఉండడం వలన ఆకతాయిలకు అడ్డాగా మారిందన్నారు. ఇలాంటి సంఘటనలు సిబ్బంది ఆత్మవిశ్వాస్వాని దెబ్బ తీయస్తున్నాయన్నారు. వీటిపై డిపో యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

762వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



స్టీల్‌ప్లాంట్ దీక్ష శిబిరం వద్ద నిరసన తెలియజేస్తున్న పెన్షన్‌దారులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తల వంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 762వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన డబ్ల్యుఎం 1, 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈపీఎస్ 95 పెన్షన్‌దారులు తలపెట్టిన దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక పెన్షన్‌దారులు రిటైర్డ్ ఉద్యోగి అప్పారావు ఆధ్వర్యంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భెల్ కార్మికుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: భెల్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. యూనియన్ అధ్యక్షుడు అలమండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భెల్ యాజమాన్యం ఎస్ఏపీ, పీపీపీలను ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదని ఆరోపించారు. త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, వీటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని దినాల అమలు చేయాలని, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, భద్రతా పరికరాలు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాహు, పి.వి.ఎస్.రాజు, నవీన్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

20న అప్రెంటిస్‌షిప్ మేళా

పెదగంట్యాడ: ఐటీఐలో వివిధ ట్రేడులను పూర్తి చేసుకున్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థుల కోసం ఈ నెల 20న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్ సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు మేళా ప్రారంభం కానుందని, మొత్తం 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు రెండు సెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు http://www. apprenticeshipindia.gov.in/mela నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

అంతర్ విభాగ క్రికెట్ పోటీల విజేత బ్లాస్ట్‌ఫర్నేస్



విజేతగా నిలిచిన బ్లాస్ట్‌ఫర్నేస్ జట్టు క్రీడాకారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంతర్‌విభాగ క్రికెట్ పోటీల్లో బ్లాస్ట్‌ఫర్నేస్ (బీఎఫ్) జట్టు విజేతగా గెలుపొందింది. ఉక్కు స్టేడియంలో మూడు రోజులుగా పోటీలు జరుగుతున్నాయి. బీఎఫ్, ఎస్ఎంఎస్ జట్లు ఫైనల్ పోరులో తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బీఎఫ్ జట్టు 31.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎంఎస్ జట్టు 140 పరుగులకే ఆలౌట్ కావడంతో బీఎఫ్ జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. జట్టు క్రీడాకారులను సీజీఎం ఆర్. మొహంతి, జీఎం బి. కృష్ణారావు, చక్రవర్తి, పి.వి. నగేష్ అభినందించారు.

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- సమయానికి ముందే చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడిన ప్రయాణికులు, విద్యార్థులు



బుచ్చిరాజుపాలెంలో కేంద్రం వద్ద పరీక్ష గదులను చూసుకుంటున్న విద్యార్థులు



బుచ్చిరాజుపాలెం శ్రీ చైతన్య కళాశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



గాయత్రి కళాశాల వద్ద ఇలా..

గోపాలపట్నం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద బుధవారం ఉదయం సందడి నెలకొంది. ఉదయం 7.30 గంటల నుంచే ఒక్కొక్కరుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. 9 గంటల వరకు విద్యార్థులు వస్తూనే ఉన్నారు. ఇక్కడి నారాయణ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద 9 గంటలకు ఒక నిమిషం ముందు వరకు విద్యార్థులను అనుమతించారు.

గాయత్రి కళాశాల వద్ద ట్రాఫిక్ జామ్

ఇంటర్ పరీక్షల నేపథ్యంలో బీఆర్‌టీఎస్ రహదారి నుంచి గాయత్రి కళాశాల రోడ్డు రద్దీగా మారింది. ఉదయం సమయం కావడం, పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులు కుటుంబ సభ్యులతో రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఒక్కరే ఉండటంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. 8.30 దాటిన తరువాత పరీక్ష కేంద్రాల లోపలికి విద్యార్థులను అనుమతించారు. అంతవరకు అటు ప్రయాణికులు, ఇటు విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. దీనివల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఆందోళన చెందారు.



మల్కాపురంలో పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థులు

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పలు కేంద్రాల వద్ద ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు అర గంట ముందే కేంద్రాలకు వచ్చారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల, ఆండాళమ్మ కళాశాల వద్ద కేంద్రాల్లో సుమారు 11వందల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు అవసరమైన చర్యలను చేపట్టారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్షయ వ్యాధిని అంతమొందిద్దాం



ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రం వద్ద సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శశిప్రియాంక

కంచరపాలెం: కప్పరాడ-బాపూజీనగర్, కంచరపాలెం-ఆర్పీ పేట వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో సైకిల్ ర్యాలీలు చేశారు. వీటిని ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక, డాక్టర్ సనపల రాజేంద్ర, డాక్టర్ సువర్ణ ప్రియాంక ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పేరిట అవగాహన చేపట్టినట్లు తెలిపారు. ఆర్పీ పేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ పీఆర్‌వో ఎన్.పైడిరాజు, టీబీ సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, అమృత స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



కప్పరాడలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్లు రాజేంద్ర, సువర్ణ ప్రియాంక

కార్మిక శాఖ అధికారి దృష్టికి సమస్యలు



కేంద్ర కార్మికశాఖ అధికారి మధుకు సమస్యను వివరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు గ్రామిక సంఘం నాయకులు కేంద్ర కార్మిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.ఎస్. మధును కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు బుధవారం విచ్చేసిన మధును నాయకులు కలిసి, సమస్యలను వివరించారు. మూడు నెలలుగా నిర్వాసిత కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, చాలామందికి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని చెప్పారు. కర్మాగారం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి కాంట్రాక్ట్ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారని, వారికి ఉక్కు యాజమాన్యమే నేరుగా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొద్దు పైడిరాజు, కరణం సత్యారావు, బి. శివరాజేష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావుకు వీడ్కోలు



లింగేశ్వరరావును సత్కరిస్తున్న సీజీఎం ప్రకాశ్, మాజీ జీఎం కుమార్

ఉక్కునగరం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావుకు ఉక్కు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్టీల్‌ప్లాంట్ క్రీడా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న లింగేశ్వరరావు ఉద్యోగానికి రాజీనామా చేశారు. దీంతో ఉక్కు స్టేడియంలోని క్రీడా విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, మాజీ జీఎం ఎం.ఎస్. కుమార్ హాజరై లింగేశ్వరరావుకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. వారు మాట్లాడుతూ లింగేశ్వరరావు అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు స్టీల్‌ప్లాంట్‌కు గర్వకారణమన్నారు. ఆయన భవిష్యత్తు ప్రణాళికలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం అధికారులు అమిత్ ఘడాయ్, మురళీమోహన్, కె. శ్రీనివాసరావు, కాశీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.